యాదయ్యను పరామర్శించిన ఎంపీ రంజిత్ రెడ్డి

ఎమ్మెల్యే కాలే యాదయ్యతో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్ రెడ్డి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 2 : పార్లమెంట్ సమావేశాలకు ఢిల్లీ వెళ్లిన ఎంపీ రంజిత్ రెడ్డి శుక్రవారం నగరానికి చేరుకున్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా సోమాజిగూడ యశోద ఆస్పత్రికి చేరుకుని దవాఖానలో చికిత్స పొందుతున్న చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్యను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

దేవాలయంలో చోరీ.. పాత నేరస్తుడి అరెస్టు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 2 : చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆల్కాపురి శ్రీ బ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో చోరీకి పాల్పడిన పాత నేరస్తుడిని అరెస్టు చేసిన పోలీసులు నిందితుడి వద్ద నుంచి 17 గ్రామాలు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేటకు చెందిన గాజుల ప్రశాంత్ అలియాస్ క్రీసుదాస్ ప్రస్తుతం నగరంలోని షేక్‌పేట్ నాలా వద్ద అద్దెకు ఉంటూ కూలీ పనులు చేస్తుంటాడు. పాత నేరస్తుడైన ప్రశాంత్ (24) జనవరి 31న రాత్రి ఆల్కాపురిలోని శ్రీ బ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి ఆలయంలోని సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 17 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో 12 కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైనట్లుగా పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రియుడికి రూ.43వేలు ఇచ్చి.. భర్తను హత్య చేయించిన భార్య

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే ఈ దారుణం

కిరాయికి రమ్మని.. నిజామాబాద్ తీసుకెళ్లి..

- మద్యం తాగించి.. కత్తులతో పొడిచి చంపిన ప్రియుడి గ్యాంగ్
- కారు డిక్కీలో మృతదేహం హైదరాబాద్‌కు తరలింపు
- జవహర్‌నగర్‌లోని నిర్జన ప్రదేశంలో పెట్రోల్ పోసి తగలబెట్టిన నిందితులు
- హత్య ఘటన మొత్తం ఎప్పటికప్పుడు లైవ్‌లో తెలుసుకున్న భార్య
- కారు టైర్ల అచ్చులతో నిందితులను గుర్తించిన ఎస్‌ఓటీ పోలీసులు
- నిందితులు అరెస్టు

అరెస్టైన నిందితులు

సందిరి స్వామి(ఫైల్)

జవహర్‌నగర్, ఫిబ్రవరి 2 : వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని.. ప్రియుడికి డబ్బులిచ్చి భర్తను దారుణంగా హత్య చేయించి, పెట్రోల్ పోసి కాల్చివేసిన సంఘటనలో జవహర్‌నగర్ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సీతారం తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌లోని ముత్తు స్వామి కాలనీకి చెందిన సందిరి స్వామి(35) డ్రైవర్. అతడికి భార్య కావ్య, ఇద్దరు పిల్లలున్నారు. అయితే అదే కాలనీలో నివాసముండే డ్రైవర్ ప్రణయ్‌కుమార్ అలియాస్ ప్రణయ్‌తో కావ్య వివాహేతర సంబంధం పెట్టుకున్నది. భర్తకు తెలియకుండా తన వద్ద ఉన్న ఆరు తులాల బంగారం, యాప్‌ల నుంచి లోన్లు తీసుకొని దఫదఫాలుగా రూ.8 లక్షలు ప్రియుడికి ఇచ్చింది. ఈ వ్యవహారం భర్త స్వామికి తెలియడంతో మందలించాడు. దీంతో ప్రియుడితో కలిసి భర్తను అంతమొదించాలని ప్లాన్ చేసింది. ఖర్చుల నిమిత్తం ప్రణయ్‌కి రూ.43 వేలు ఇచ్చి ఈ నెల 26న ముహూర్తం ఖరారు చేసింది. ఇదిలా ఉండగా స్వామిని కలిసిన ప్రణయ్ రెండు రోజులు కూలీ ఇస్తాను.. డ్రైవర్‌గా నిజామాబాద్‌కు రావాలని కోరాడు. ఇద్దరూ కలిసి నిజామాబాద్‌కు చేరుకున్నారు. అక్కడ ప్రణయ్ స్నేహితుడైన పసుపులేని రోహిత్‌ను కలిశారు. 26వ తేదీ రాత్రి స్థానికంగా ఉన్న ఓ వెంచర్‌లో మద్యం సేవించారు. స్వామి మత్తులోకి జారుకున్న తర్వాత కారు ముందు సీట్లో కూర్చోబెట్టిన ప్రణయ్, రోహిత్ అతడిని కత్తితో పొడిచి హతమార్చారు. అనంతరం మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకొని తిరిగి జవహర్‌నగర్‌లోని వికలాంగుల కాలనీ కౌకుర్ అటవీ ప్రాంతానికి తీసుకువచ్చారు. అక్కడ మరో స్నేహితుడు మబ్బు నగేశ్ సహాయంతో జనవరి 27న ఉదయం స్వామి మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించి పరారయ్యారు.

టైర్ల గుర్తులతో..!

28వ తేదీన ఆటవీ ప్రాంతంలో సగం కాలిన మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు దర్యాప్తు కోసం వెంటనే 10 బృందాలను రంగంలోకి దింపారు. మల్కాజిగిరి ఎస్‌ఓటీ డీసీపీ గిరిధర్ నేతృత్వంలోని బృందం అక్కడ సీసీ కెమెరాలను విశ్లేషించారు. ఈ దారిలో రెండు మూడు కార్లు వచ్చిపోయినట్లు తేలింది. ఘటన స్థలంలో కారు టైర్ల అచ్చులను పరిశీలించిన పోలీసులు.. ప్రణయ్ కిరాయికి నడుపుతున్న కారుగా గుర్తించారు. దీంతో ప్రణయ్‌ని అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ప్రియుడు ప్రణయ్, అతడి స్నేహితులు రోహిత్, మబ్బు నగేశ్‌లను అరెస్టు చేశారు.

హత్య విషయం లైవ్..!

భర్తను హత్య చేస్తున్న విషయం ఎప్పటికప్పుడు కావ్య ప్రణయ్ ద్వారా లైవ్‌గా తెలుసుకున్నది. నిజామాబాద్‌లో మద్యం సేవించి నిద్రపోతున్నాడని, ఆ తర్వాత కత్తులతో చంపేశామంటూ ప్రణయ్ చెబుతూ వచ్చాడు. మరుసటి రోజు ఉదయం మృతదేహాన్ని కాల్చేస్తున్న సమయంలోనూ ప్రణయ్, తన ప్రియురాలితో విషయాలు అప్‌డేట్ చేస్తూ వచ్చాడు. అయితే తన భర్తను హత్య చేయించేందుకు రూ.43 వేలు ప్రణయ్‌కి గూగుల్ పేలో కావ్య పంపించింది.

రావి నారాయణరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

అబిడ్స్, ఫిబ్రవరి 2 : తెలంగాణ సాయుధ రైతు పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం సచివాలయంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, రావి నారాయణ రెడ్డి తనయుడు, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు ఆర్.సుఖేష్ రెడ్డి కలిసి వినతి పత్రం సమర్పించారు. రాయగిరిలో నిర్మిస్తున్న క్రీడా ప్రాంగణానికి రావి నారాయణ రెడ్డి నామకరణం చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా విగ్రహం ఏర్పాటుకు కూడా ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

పెన్షనర్ల ఆరోగ్య పథకాన్ని అమలుచేయాలి

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నారాయణ

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 2 : ఉద్యోగ పెన్షనర్ల ఆరోగ్య పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మోహన్‌నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఆర్‌లను వెంటనే ప్రకటించాలని, పీఆర్‌సీ 2023ను త్వరితగతిన అమలు చేయాలని, కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్‌ను 15 సంవత్సరాలకు బదులు 12 సంవత్సరాలకు కుదించి అమలు చేయాలని, 70, 75, 80, 85 ప్రారంభ సంవత్సరాలకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నర్సరాజు, రాష్ట్ర, జిల్లాల సంఘ నాయకులు కె.యాదయ్య గౌడ్, జె.రవీందర్, నాగమాంబ, రామయ్య, రంగరాజు, శివరాజు, చంద్ర మౌళి, కృష్ణమూర్తి, యుగంధర్, అప్పారావు, కోలా మోహన్, కుర్మారావు, లక్ష్మీనారాయణ, జయరాములు, గంగాధర్, యతిరాజ్, దేవేందర్ రెడ్డి, అంజయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు ఇచ్చేదాకా.. పూడిక తియ్యం

- జలమండలి వర్సెస్ సీవర్ క్లీనింగ్ మెషిన్ ఓనర్స్
- రెండో రోజూ నిలిచిన పూడికతీత పనులు
- పలు చోట్ల పొంగిపొర్లిన డ్రైనేజీలు
- నెలవారీ చెల్లింపులలో నెలకొన్న వివాదం
- ప్రభుత్వం జోక్యం చేసుకోకుంటే మరింత ఇబ్బందులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో రెండో రోజూ పూడికతీత పనులు నిలిచిపోయాయి. బిల్లులు ఇచ్చేదాకా పూడిక (సీవరేజీ) ఎత్తివేసేది లేదంటూ గురువారం నుంచి సీవర్ క్లీనింగ్ మెషిన్స్ ఓనర్స్ అసోసియేషన్ నిరసనకు దిగారు. విధుల్లోకి వెళ్లకుండా దాదాపు 200 వాహనాలను నిలిపివేసి పూడికతీత పనులకు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో నగరంలో కొన్ని చోట్ల రహదారులపై మురుగు పొంగిపొర్లింది. రోజూ 1500 చోట్ల పూడికతీత పనులు చేపట్టే వీరంతా రెండు రోజులుగా విధుల్లో చేరకపోవడంలో సీవరేజీ ఓవర్‌ఫ్లో సంఖ్య పెరిగింది. పొంగిపొర్లే మురుగునీటితో దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో ప్రజలు అనారోగ్యబారిన పడే అవకాశాలు ఉన్నాయి. అధికారులు మాత్రం బిల్లుల చెల్లింపులో అభ్యంతరాలు నెలకొన్నాయని.. ఒక్కో వాహనానికి నెలకు రూ.2లక్షలు చెల్లించే విషయంలో దాదాపు 40వేల వరకు డబుల్ పేమెంట్స్ జరుగుతూ ఆడిట్ అభ్యంతరాలు వస్తున్నాయంటున్నారు. సీవర్ క్లీనింగ్ మెషిన్స్ ఓనర్స్ అసోసియేషన్‌కు చెప్పినా వారు వినడం లేదని అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా బిల్లులు చెల్లించే వరకు పూడిక ఎత్తివేయమని, విధుల్లోకి చేరమని సీవర్ క్లీనింగ్ మెషిన్స్ ఓనర్స్ అసోసియేషన్ చెబుతుండడం.. ఈ నిరసన ఇలాగే కొనసాగితే ముమ్ముందు మరింత ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే జోక్యం చేసుకుని ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

హెల్త్‌కేర్ రంగంలోని స్టార్టప్‌లకు టీహబ్ ప్రోత్సాహం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : హెల్త్‌కేర్ రంగంలోని స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు టీ హబ్, ఆవిష్కరణ్ ఇంక్యుబేటర్‌లు కలిసి పనిచేయనున్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య, ఆరోగ్య రంగంలోనూ ఔత్సాహిక స్టార్టప్ వ్యవస్థాపకులకు మద్దతు ఇచ్చేందుకు టీహబ్‌తో నైపర్ హైదరాబాద్ విద్యా సంస్థలోని ఆవిష్కరణ్ ఇంక్యుబేటర్ కలిసి పనిచేస్తున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మేషిన్ లర్నింగ్, సాస్ డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్స్, హెల్త్‌కేర్, ఫార్మా, బయోటెక్నాలజీ వంటి అంశాలపై స్టార్టప్‌లను ప్రోత్సహించనున్నామని టీ హబ్ ప్రతినిధి తెలిపారు. ఫిబ్రవరి 15లోగా https://bit.ly/3S4ElrG దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యువతను సన్మార్గంలో నడపడంలో షీ టీమ్స్ సక్సెస్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 2 : మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడంతో పాటు యువతను సన్మార్గంలో నడపడంలో షీ టీమ్స్ ప్రభావవంతంగా పని చేస్తుందని జాయింట్ సీపీ రంగనాథ్ పేర్కొన్నారు. ఈవ్ టీజింగ్, వేధింపులు తదితర కేసుల్లో పట్టుబడిన 118 మంది మేజర్లతో పాటు 8మంది మైనర్లకు వారి తల్లిదండ్రుల సమక్షంలో శుక్రవారం డీసీపీ కవిత ఆధ్వర్యంలో మనో జాగృతి ఫౌండేషన్ సౌజన్యంతో కౌన్సెలింగ్ నిర్వహించారు. సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ గీతా చాల్, యునిసెఫ్‌లో బాలల హక్కుల పరిరక్షణ ప్రాజెక్ట్ మేనేజర్ డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'సైకిల్ టూ వర్క్'పై అవగాహన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : నగరంలోని మెట్రో స్టేషన్లలో హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం 'సైకిల్ టూ వర్క్'పై అవగాహన కల్పించారు. మెట్రో స్టేషన్ నుంచి కార్యాలయానికి, తిరిగి ఇంటికి సైకిల్ వినియోగించాలని కోరారు. గచ్చిబౌలీ, అమీర్‌పేట్, హైటెక్ సిటీ తదితర మెట్రో స్టేషన్లలో ఉద్యోగులు, విద్యార్థులకు ప్రత్యేకంగా సైక్లింగ్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ ఏడాది సుమారు 500 మంది ఉద్యోగులు కార్యాలయానికి సైకిల్‌పై వెళ్లేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతామని సంస్థ ఫౌండర్ రవీందర్ నందనూరి తెలిపారు. కార్యక్రమంలో ఆకాశ్ శశిధరణ్, అస్లాం, దర్శన్, సుధాకర్, పురుషోత్తం, శ్రీకంటి, అమినుద్దీన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తాం

అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ అజిత్ కుమార్ సింగ్

మల్కాజిగిరి, ఫిబ్రవరి 2 : రైల్వే అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ అజిత్ కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి రైల్వే స్టేషన్ విస్తరణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ శివరాం, డీఆర్‌యూసీసీ సభ్యుడు సూర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో పరీక్షలు బహిష్కరించిన విద్యార్థులు

పరీక్షలు బహిష్కరించి, ధర్నా చేస్తున్న లా కళాశాల విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 2 : ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలను బహిష్కరించి, కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నెలల తరబడి మెస్ ప్రారంభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్సు ఫీజు, పరీక్షా ఫీజులను విపరీతంగా పెంచారని మండిపడ్డారు. తక్షణమే పెంచిన ఫీజులను తగ్గించాలని కోరారు. తమ హాస్టల్ సమస్యలకు నిలయంగా మారిందని వాపోయారు. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణకు కట్టుబడిన వారికే మద్దతు

మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న పెరిక సురేశ్, తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 2 : అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం అవసరమని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఓబీసీ మోర్చా సోషల్ మీడియా జాతీయ సభ్యుడు పెరిక సురేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం మందకృష్ణను మార్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడిన వారికే ఎస్సీల సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల్లో వర్గీకరణ జరిగితేనే ఇరు రాష్ట్రాల మాదిగలకు న్యాయం జరుగుతుందని అన్నారు.

డైరీ ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వానికి, ప్రజలకు రెవెన్యూ ఉద్యోగులు అందిస్తున్న సేవలు మరువలేనివని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీని శుక్రవారం ఆయన తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్, ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు చంద్రావతి, చంద్రకళ, చంద్రయ్య, కోశాధికారి భాస్కర్ రావు, టీవీఆర్వీజేఏసీ చైర్మన్ గోల్కొండ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

16 ఏండ్ల తరువాత.. జైలు నుంచి విడుదలైన సైదాబాద్ వాసి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): సీరియల్ బాంబు పేలుళ్ల కేసులో అరెస్టయిన నగరానికి చెందిన రజీయుద్దీన్ నసీర్ 16 ఏండ్ల తరువాత బెయిల్‌పై గుజరాత్ జైలు నుంచి బయటకు వచ్చాడు. పేలుళ్ల కేసు కొట్టేసినా, జైలు నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించిన మరో కేసులో జైల్లో ఉన్నాడు. ఈ కేసులో బెయిల్ రావడంతో బయటకు వచ్చాడు. సైదాబాద్‌కు చెందిన వాహదత్- ఈ- ఇస్మాయిల్ అధ్యక్షుడు, 2020లో మృతి చెందిన మౌలానా నసీరుద్దీన్ చిన్న కుమారుడు రజీయుద్దీన్ నసీర్. ఇదిలా ఉండగా.. అహ్మదాబాద్‌లో 2008లో జరిగిన వరుస పేలుళ్ల ఘటనల్లో 56 మంది మృతి చెందారు. ఈ కేసులో ఇండియన్ ముజాయుద్దీన్, సిమికి చెందిన 28 మందిని అరెస్ట్ చేయగా.. అందులో రజీయుద్దీన్ కూడా ఒక నిందితుడు. కాగా, ఈ కేసును 2022లో కోర్టు కొట్టేసింది. అయితే, రజీయుద్దీన్ జైలు నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడనే మరో కుట్ర కేసు పెండింగ్‌లో ఉండటంతో, పేలుళ్ల కేసు కొట్టేసినా జైలు నుంచి బయటకు విడుదల కాలేదు. ఈ నేపథ్యంలోనే తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ నజీరుద్దీన్ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో బెయిల్ మంజూరైంది. గురువారం గుజరాత్‌లోని సబర్మతి జైలు నుంచి విడుదలై, సైదాబాద్‌లోని తన ఇంటికి చేరుకున్నాడు.

శివబాలకృష్ణ చిట్టా.. తవ్వుతూనే ఉన్నరు..!

- ఆకాశహర్మ్యాల అనుమతులపై ఏసీబీ ఫోకస్
- ఎంఎస్‌బీ లెక్కలను తీసే పనిలో నిమగ్నం
- ఏం జరుగుతుందోనని ఉద్యోగుల్లో టెన్షన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన శివ బాలకృష్ణ విచారణలో బహుళ అంతస్థుల భవన నిర్మాణ అనుమతులు కీలకంగా మారాయి. రెరా సెక్రెటరీ, మెట్రో రైలు ప్లానింగ్ విభాగం జీఎంగా బదిలీ కాకముందు ఆయన ఎక్కువ కాలం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)లో ప్లానింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడినట్లు ఏసీబీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎండీఏలో ఆయన పనిచేసిన సమయంలో ఇచ్చిన మల్టీ స్టోర్డ్ బిల్డింగ్స్ (ఎంఎస్‌బీ) లెక్కలను తీసే పనిలో ఏసీబీ నిమగ్నమైంది. పలుమార్లు బాలకృష్ణను ఏసీబీ విచారించినా, ఆ సమయంలో ఆయన పెద్దగా నోరు విప్పలేదు. కాగా చాలా ఫిర్యాదులు అనుమతులు ఇచ్చే విషయంలోనూ రావడంతో ఏసీబీ అధికారులు హెచ్‌ఎండీఏలో ఫైళ్లను సేకరిస్తున్నారు. ఇప్పటికే గత ఆదివారం సెలవు రోజు అయినా ఫైళ్లను ఏసీబీ పరిశీలనకు ఇచ్చేందుకు ప్రత్యేకంగా హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగం అధికారులు సేకరించారు. గత వారం రోజులుగా ఇదే పనిలో ఉన్నట్లుగా కొందరు ఉద్యోగులు పేర్కొంటున్నారు. వేలాది దరఖాస్తులు ఉండడంతో వాటిని గుర్తించడానికి అధిక సమయం పడుతున్నదని చెబుతున్నారు.

ఆకాశహర్మ్యాలపై ఫోకస్...

గ్రేటర్ పరిధి దాటిన తర్వాత ఉన్న ప్రాంతమంతా హెచ్‌ఎండీఏ పరిధిలోనే ఉంది. నగరం నలువైపులా ఉన్న హెచ్‌ఎండీఏలో 4 జోన్లు (శంకర్‌పల్లి, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్) ఉండగా, ఇందులో శంకర్‌పల్లి, మేడ్చల్ జోన్ల పరిధిలోనే ఎక్కువ సంఖ్యలో ఆకాశహర్మ్యాల నిర్మాణాలు వచ్చాయి. 2018 నుంచి 2023 జూలై వరకు హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌గా శివ బాలకృష్ణ పనిచేశారు. ఆ సమయంలో ఇచ్చిన అనుమతుల వివరాలను ప్రత్యేకంగా నివేదికలను సిద్ధం చేయడంతో పాటు దరఖాస్తు పత్రాలను బయటకు తీస్తున్నారు. ముఖ్యంగా ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్‌ఎస్ఐ) విషయంలో ఎలాంటి పరిమితులు లేకపోవడంతో మొత్తం విస్తీర్ణంలోని భూమికి అనుగుణంగా అనుమతులు ఇవ్వాల్సి ఉండగా, దాన్ని పక్కన పెట్టి ఎక్కువ అంతస్థులకు అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో అలాంటి అనుమతులు పొందిన భారీ బహుళ అంతస్థుల భవనాల దరఖాస్తులను ప్రత్యేకంగా సేకరించి, వాటి కోసం తయారు చేసిన నివేదికలను సేకరిస్తున్నారు. రోడ్డు విస్తీర్ణం సరిగా లేకున్నా, ఎక్కువ మొత్తంలో అంతస్థులు నిర్మించుకునేలా ఇచ్చిన ఫైళ్లను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాలు స్పష్టంగా ఉండడంతో హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగం అధికారులు, ఉద్యోగులు ఫైళ్లను వారు అడిగినట్లుగా ఇచ్చేందుకు అయిష్టంగానే పనిచేస్తున్నట్లు సమాచారం. శివ బాలకృష్ణ అక్రమ ఆస్తుల కేసు ప్రభావం పూర్తిగా హెచ్‌ఎండీఏ కేంద్రంగా ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రణాళికా విభాగం అధికారులు భయాందోళనతో ఉన్నారు. ఈ కేసు కారణంగానే పనిఒత్తిడి పెరిగి ఓ ఉద్యోగి గుండె పోటుతో మృతి చెందిన సంఘటన హెచ్‌ఎండీఏలో మరింత ఆందోళనకు దారి తీసింది. ఈ కేసు పరిణామాలతో ముమ్ముందు ఏం జరుగుతుందోనన్న భయం ఉద్యోగులను వెంటాడుతూనే ఉంది.

ఉద్యోగినిపై మనసుపారేసుకున్న కంపెనీ సీఈవో

జూమ్ మీటింగ్‌లో చూశాడు.. అమెరికా నుంచి ఇండియాకు వచ్చాడు

వేదింపులు తట్టుకోలేక పీఎస్‌లో యువతి ఫిర్యాదు

ఇన్ఫో గ్రావిటీ కంపెనీ సీఈవోపై కేసు నమోదు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 2 : ఎంత అందంగా ఉన్నావో తెలుసా.. సినిమాల్లోని హీరోయిన్‌కు ఏమాత్రం తగ్గని అందం నీది.. అంటూ ఓ యువతిని పొగడ్తలతో ముంచెత్తిన యువకుడు ఆమె కోసం అమెరికా నుంచి ఇండియాకు వచ్చేశాడు. ఇక్కడికి వచ్చిన తర్వాత బాధిత యువతికి వేదింపులు అధికం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేట్‌లోని ఓ కంపెనీలో హెచ్‌ఆర్ అండ్ లీగల్ మేనేజర్‌గా యువతి (28) పని చేస్తుంది. ఇన్ఫో గ్రావిటీ కంపెనీ సీఈవో టి.చంద్ర అమెరికాలో నివాసముండేవాడు. సదరు యువతి ఇండియా మేనేజర్‌గా పనిచేస్తూ కంపెనీ వ్యవహారాలు, జూమ్ మీటింగ్‌లను చక్కగా నిర్వహించేది. ఆఫీస్ జూమ్ మీటింగ్‌లో సైతం ఆ యువతి అందాలను పొగిడేవాడు చంద్ర. కంపెనీ బాస్ కావడంతో అతన్ని మందలించలేకపోయేది. దాన్ని అలుసుగా తీసుకున్న చంద్ర మరింతగా రెచ్చిపోయేవాడు. గత డిసెంబర్ 22వ తేదీన అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చేశాడు. అమీర్‌పేట్‌లోని కార్యాలయంలో మీటింగ్ ఏర్పాటు చేశాడు. తన కంపెనీకి ఇండియా మేనేజర్‌గా పనిచేసే ఆ యువతిని తన పక్కనే కూర్చోబెట్టుకున్నాడు. నెక్లెస్ రోడ్డులోని వాటర్ రెస్టారెంట్‌కు తీసుకెళ్లిన అతను తన మనస్సులోని మాటను బయటపెట్టాడు. అందుకు ఆమె తిరస్కరించి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఐదు రోజుల పాటు ఆఫీసుకు సెలవుపెట్టింది. ఆ తర్వాత జనవరి 8వ తేదీన డ్యూటీకి వచ్చిన యువతిని లైంగికంగా వేధించాడు. దీంతో జనవరి 12న తన ఉద్యోగానికి రాజీనామా చేసింది. రిలీవింగ్ లెటర్, ఎక్స్‌పీరియన్స్ లెటర్, జీతం, లీగల్ సర్వీసెస్ చార్జెస్ డ్యూస్ ఇవ్వాలని విన్నవించుకుంది. తన కోరిక తీరిస్తేనే ఇస్తానని కంపెనీ సీఈవో చంద్ర మొండికేయడంతో.. ఇక చేసేదిలేక మధురానగర్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జేఎన్‌టీయూలో అంతర్జాతీయ సదస్సు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): జేఎన్‌టీయూ హైదరాబాద్ ఆడిటోరియంలో సొసైటీ ఆఫ్ ఫార్మా ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ సంస్థ, ఫార్